క్లుప్తంగా

వినోద్ మృతి పార్టీకి తీరనిలోటు

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున



వేమూరు: వైఎస్సార్ సీపీ కార్యకర్త చాగమర్రి వినోద్ మరణం పార్టీకి తీరని లోటని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున అన్నారు. రోడ్డు ప్రమాదంలో ఈనెల 2వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పార్టీ కార్యకర్త చాగమర్రి వినోద్ ఇంటివద్ద శనివారం జరిగిన ఆదరణ కూడికలో పాల్గొని ఆయన చిత్ర పటానికి మేరుగ నాగార్జున పూలదండలు వేసి నివాళులర్పించారు. నాయకులు చందోలు డేవిడ్ విజయకుమార్, కోగంటి లవకుమార్, బొల్లిముంత ఏడుకొండలు, చాగమర్రి శ్రీకాంత్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు తాడిబోయిన అంకమరావు, చందోలు బాబురావు పాల్గొన్నారు.

నిజాంపట్నంలో ఉచిత వైద్యశిబిరం



నిజాంపట్నం: నేచురోపతి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిజాంపట్నం, కేర్ యోగ నేచురోపతి మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో మండలంలోని నిజాంపట్నం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యాలయంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు బీపీ, షుగర్, మెదడు, మోకాలు, నడుము నొప్పులు, మానసిక వ్యాధులు, స్త్రీల ఆరోగ్య సమస్యలపై 52 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ప్రకృతి వైద్య చికిత్సలతో ఆరోగ్యంపై ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవన్నారు. నిజాంపట్నం రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కె.గౌరీశంకర్, కేర్ హాస్పిటల్ వైద్యులు సమీరా, బాష్మిలా, నిర్వాహకుడు నాగేశ్వరరావు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెనూ సక్రమంగా పాటించాలి



కర్లపాలెం: పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం కర్లపాలెంలోని ప్రాథమిక పాఠశాలను, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపీడీఓ ఆకస్మిక తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం కోసం ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తుందని చెప్పారు. మిడ్డే మీల్స్ నిర్వాహకులు మెనూ ప్రకారం భోజనం శుభ్రంగా, రుచిగా తయారు చేసి పెట్టాలని చెప్పారు. అనంతరం ఆయన విద్యార్థులకు భోజనం వడ్డించటంతో పాటు వారితో కలసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

ఓవర్ బ్రిడ్జి ఫుట్‌పాత్ గోతులను పూడ్చాలి

తెనాలిరూరల్: తెనాలి పట్టణంలోని పాత బస్టాండ్ నుండి చెంచుపేట వైపు వెళ్లే ఓవర్ బ్రిడ్జిని పట్టణ పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో శనివారం పరిశీలించారు. ఓవర్ బ్రిడ్జిపై పాదచారులు వెళ్లే ఫుట్‌పాత్ పై గోతులు ఉండడాన్ని గమనించిన సభ్యులు తక్షణమే గోతులకు మరమ్మతులు చేయాలని రైల్వే అధికారులను డిమాండ్ చేశారు. గోతుల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. అలాగే చినరావూరు రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కేందుకు ప్లాట్‌ఫాం ఎత్తు సరిగాలేదని, ఎత్తు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని ప్లాట్‌ఫాంల మీద ఎక్స్‌ప్రెస్ రైళ్లు వచ్చినప్పుడు పేరు భోగీ నంబరు కనబడేలా డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో దరిశి శివకోటేశ్వరరావు, అబ్దుల్ ఆరిఫ్, రావూరి శివ శంకర్‌రావు, నారాయణం కమల్ కుమార్, సాతులూరి రాజేష్, అబ్రహం లింకన్, లకరాజు చిరంజీవి ,కటారి వాసుదేవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ స్థలాల్లో 'పచ్చ' పాగా



నగరం గ్రామ సచివాలయ భవన సముదాయాన్ని ఆక్రమించుకుని కర్రల వ్యాపారం చేస్తున్న టీడీపీ నాయకులు



నగరం మెయిన్ సెంటర్‌లోని పంచాయతీ స్థలంలో వేసిన రేకుల షెడ్డు

- నగరంలో పంచాయతీ స్థలాలను ఆక్రమించుకుని వ్యాపారాలు చేస్తున్న టీడీపీ నాయకులు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు

నగరం: అధికారంలో ఉన్నాం..ఏం చేసినా చెల్లుతుంది అన్న చందాన టీడీపీ నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరించి పంచాయతీ స్థలాలను ఆక్రమించుకుంటున్నారు. ఎక్కడ ఖాళీ కనబడితే అక్కడ జాగా వేసి నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు చేసుకుంటున్నారు..ఆక్రమణల పర్వం కొనసాగుతున్న అధికారులు మాత్రం కన్నెత్తి కూడా చూడటం లేదు.

సచివాలయ భవన సముదాయాన్ని సైతం..

మండల కేంద్రమైన నగరంలో గత ప్రభుత్వం హయాంలో సుమారు రూ 25 లక్షల వ్యయంలో గ్రామ సచివాలయ భవన నిర్మాణం చేపట్టారు. బేస్‌మెంట్ లెవల్‌లో గ్రామ సచివాలయ భవన నిర్మాణ పనులు నిలిపివేయాలని టీడీపీ నాయకులు కోర్టుకు వెళ్లి స్టే తేవడంతో పనులు నిలిచిపోయాయి. కోర్టు పరిధిలో ఉన్న గ్రామ సచివాలయ భవన సముదాయంపై టీడీపీ నాయకుల కన్ను పడింది. ఇంకేముంది ఆక్రమించుకుని ఎంచక్కా వ్యాపారాలు చేస్తున్నారు. బేస్ మెంట్ లెవల్‌లో ఉన్న భవన నిర్మాణానికి నిబంధనలకు విరుద్ధంగా గోడ కట్టి వారి అవసరమైన రీతిలో మలుచుకుని కర్రల వ్యాపారం చేస్తున్నారు. పంచాయతీ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నా అధికారులు మాత్రం తమకేమి పట్టదన్నట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తుంది.

స్వాధీనం చేసుకుంటాం..

పంచాయతీ స్థలాలు ఆక్రమణలకు గురైనట్లు మా దృష్టికి వచ్చింది. ఆక్రమణలను తొలగించి పంచాయతీకి అప్పగించే విధంగా చర్యలు చేపడతాం.

– రాజశేఖరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి

దాతలు ఇచ్చిన స్థలంలో దర్జాగా రేకుల షెడ్డు..

అదేవిధంగా నగరంలో మెయిన్‌రోడ్డులో పంచాయతీ భవన నిర్మాణానికి దాతలు ఇచ్చిన స్థలంలో రేకుల షెడ్డు వేసి దర్జాగా ఆక్రమించుకున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి ఆక్రమణలకు గురైన పంచాయతీ స్థలాలను స్వాధీనం చేసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు



సబ్‌కోర్టు పరిసరాలను శుభ్రం చేసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి

రేపల్లె రూరల్: ఆరోగ్యవంతమైన సమాజం పరిసరాల పరిశుభ్రతతోనే సాధ్యమవుతుందని సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు అన్నారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా రేపల్లె సబ్‌కోర్టులో శనివారం నిర్వహించిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రతగా ఉంచుకోవాలని ప్రతి ఒక్కరూ నోటిమాటగా చెప్పటంకాకుండా ఆచరణలో చేసి చూపాలన్నారు. పారిశుద్ధ్య మెరుగుదలకై అధికారులు నిర్వహిస్తున్న కార్యక్రమాలలో ప్రజలు సైతం భాగస్వాములై పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలన్నారు. గృహాల నుంచి వచ్చే వ్యర్థాలను నిర్ణీత చెత్తకుండీలలో పడవేయటంగాని, పారిశుద్ధ్య సిబ్బందికిగాని అందించి సహకరించాలన్నారు. అధికారులు పట్టణంలోని రహదారులను పరిశుభ్రంగా ఉంచటం, మురుగుకాల్వలలో పారుదల అయ్యేలా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనులపై వచ్చే ప్రజలు కార్యాలయాల ఆవరణంలో పరిశుభ్రతను కాపాడేవిధంగా చూసుకోవాలన్నారు. స్వచ్ఛ రేపల్లె సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములమనే అంశాన్ని గుర్తుంచుకోవాలని తెలిపారు. అనంతరం సబ్ కోర్టు పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేసన గోపాలరావు, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, శానిటరీ సెక్రటరీ సురేంద్ర, న్యాయవాదులు, మున్సిపల్ సిబ్బందిపాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

18న కలెక్టరేట్ వద్ద ధర్నా



అర్బన్ మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు

రేపల్లె రూరల్: రాష్ట్రవ్యాప్తంగా ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికై సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన ధర్నా నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ మణిలాల్ అన్నారు. సమస్యల సాధనకై నిర్వహిస్తున్న ధర్నా అంశమై సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు రేపల్లె అర్బన్ మెడికల్ ఆఫీసర్ ఎస్.రమేష్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. మణిలాల్ మాట్లాడుతూ 2024 ఫిబ్రవరిలో మెడికల్ అండ్ హెల్త్ రాష్ట్ర ప్రభుత్వ కుటుంబ సంక్షేమశాఖ అధికారులు, యూనియన్ నాయకులతో జరిపిన చర్చలలో కుదిరిన ఒప్పందాల జీఓలను వెంటనే విడుదల చేయాలన్నారు. తొమ్మిది నెలలు కావస్తున్న జీఓలు విడుదల కాకపోవడంతో ఆశావర్కర్లు తీవ్ర ఆందోళన గురవుతున్నారన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, బీమా సౌకర్యాలు, పనిభారం తదితర సమస్యలపై బాపట్ల కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న ధర్నాలో ఆశా వర్కర్‌లు పాల్గొని విజయవతం చేయాలని కోరారు. ఆశవర్కర్స్ యూనియన్ రేపల్లె పట్టణ అధ్యక్షురాలు టి.బుజ్జి, ఎస్తేర్ రాణి, కమలాదేవి, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



కార్తిక మాసం సందర్భంగా శనివారం భట్టిప్రోలు మండలం వెల్లటూరులో దీపాలంకరణలో పాల్గొన్న మహిళలు, చిన్నారులు – భట్టిప్రోలు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



నగరంలో వ్యాసరచన పోటీలలో పాల్గొన్న వివిధ పాఠశాలల విద్యార్థులు



యడ్లపల్లిలో తాము గీసిన బొమ్మల చార్టులు చూపుతున్న చిన్నారులు

నగరం: విద్యార్థి దశ నుంచే పోటీతత్వాన్ని అలవరుచుకోవాలని ఉపాధ్యాయురాలు కె.రాజ్యలక్ష్మి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మండలంలోని మంత్రిపాలెం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు శనివారం నిర్వహించిన వ్యాసరచన పోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. పోటీ పరీక్షలతో విద్యార్థులతో మేథాపటిమను, సృజనాత్మకతను వెలికితీసేందుకు అవకాశం ఉందన్నారు. ఎంతో విలువైన గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, విద్యార్థులు ఖాళీ సమయాల్లో గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గ్రంథాలయ ఉద్యమకారులు – గ్రంథాలయాలతో కలిగే ఉపయోగాలు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ నిర్వహకుడు జొన్న బ్రహ్మేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వేమూరు: చుండూరు మండలంలోని వలివేరు శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించామని గ్రంథాలయాధికారి వివేక్ తెలిపారు. వలివేరు గ్రామంలోని తూర్పు బజారులో ఉన్న మండల పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. గ్రంథాలయ విశిష్టత, వాటి ఉపయోగాల గురించి ర్యాలీ ద్వారా గ్రామస్తులకు తెలియజేశామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చుండూరు(వేమూరు): యడ్లపల్లి శాఖ గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా శనివారం ఎంపీపీ స్కూలు విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించడం జరిగిందని గ్రంథాలయాధికారి గిరిజ సుందరి తెలిపారు. పోటీల్లో విజేతలకు గ్రంథాలయ వారోత్సవాల ముగింపు రోజు బహుమతులు అందజేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు: భట్టిప్రోలులోని శ్రీ మాటూరు రామారావు శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకుని శనివారం గ్రంథాలయ ఉద్యమానికి పాటుపడిన ప్రముఖుల సంస్మరణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉద్యమ ప్రముఖులైన ఎస్ఆర్ రంగనాథన్, అయ్యంకి వెంకట రంగయ్య, పాతూరు నాగభూషణం తదితరులును గూర్చి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు నీతి కథలు రాయడంపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో 42 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీఎస్ (హెచ్ఈ) హెచ్ఎం రమా కుమారి, ఉపాధ్యాయులు మల్లికార్జునరావు, విశ్రాంత ఉపాధ్యాయులు బొలిశెట్టి శ్రీనివాసరావు గ్రంథాలయాధికారి కలపాల సుభాష్ చంద్రబోస్, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కర్లపాలెం: విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకోవాలని కర్లపాలెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని డీఎల్ ప్రసన్న చెప్పారు. గ్రంథాలయాల వారోత్సవాలలో భాగంగా కర్లపాలెం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్, చిత్రలేఖనం, ఆటల పోటీలను గ్రంథాలయాధికారి రమణమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా రమణమ్మ మాట్లాడుతూ విద్యార్థులు ఖాళీ సమయంలో ఆటపాటలు ఆడడంతో పాటు గ్రంథాలయాలకు వచ్చి తమకు ఇష్టమైన పుస్తకాలు చదవటం ద్వారా విజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు.

బాపట్లటౌన్: విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించేందుకు వ్యాసరచన పోటీలు ఎంతగానో దోహదపడుతాయని శాఖా గ్రంథాలయాధికారి ఎ.శివాజీగణేష్ తెలిపారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టంలోని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ స్కూళ్ల ఉపాధ్యాయులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది ఎ.మల్లికార్జున్, ఖాన్ పాల్గొన్నారు.

బైక్‌ను సీజ్ చేయించిన న్యాయమూర్తి

తెనాలిరూరల్: వాహనాల నంబరు ప్లేట్లపై వాహన రిజిస్ట్రేషన్ నంబరు బదులు సినీ, రాజకీయ నాయకులు ఫొటోలు పెట్టడం, వారి తాలూకా అంటూ రాయడంపై హైకోర్టు న్యాయవాది పెరికల డేనియేల్ ప్రి లిటిగేషన్ కేసు వేశారు. దీనిపై విచారించిన మండల లీగల్ సెల్ కమిటీ చైర్మన్ ఓ బైక్‌ను సీజ్ చేయించారని న్యాయవాది శనివారం తెలిపారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్యలపై తాను వేసిన ప్రి లిటిగేషన్ కేసు విచారణకు రావడంతో న్యాయమూర్తి బైక్‌ను సీజ్ చేయించి తదుపరి చర్యల కోసం ఆర్టీఓ అధికారులకు అప్పగించినట్టు వివరించారు.

ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడపడం, లారీలు, ట్రాక్టర్లు అధిక లోడుతో వెళుతుండడం, మైనర్లు వాహనాలు నడపడం, చంటి పాపలతో భిక్షాటన చేయడం వంటి అంశాలను న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లగా ఈ నెల 30వ తేదీకి కేసు వాయిదా వేశారని తెలిపారు.

విద్యారంగానికి అరకొర కేటాయింపులు

ఎస్ఎఫ్ఐ బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు పి.మనోజ్ కుమార్

భట్టిప్రోలు: పెండింగ్‌లో ఉన్న విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలు బడ్జెట్‌లో కేటాయించి విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ బాపట్ల జిల్లా కమిటీ అధ్యక్షుడు పి.మనోజ్ కుమార్ శనివారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే పలుమార్లు సమస్యలపై విన్నవించినా ప్రభుత్వం జాప్యం చేస్తూ కల్లబొల్లి మాటలతో తాత్సారం చేస్తుందని పేర్కొన్నారు. అలాగే విద్యార్థులు ఫీజులు చెల్లించలేక పడరాని పాట్లు పడుతున్నారని ఫీజులు చెల్లిస్తేనే అనుమతులు ఇస్తామని యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో విద్యా రంగానికి కేటాయించిన బడ్జెట్ అరకొరగా ఉందన్నారు. తల్లికి వందనంపై కూడా అనుమానాలు పెరిగాయని, ఇప్పటికైనా ప్రభుత్వం పథకాల అనుమతులపై స్పష్టమైన వైఖరి తెలియ చేయాలని కోరారు. ఈ సమస్యలపై ఈ నెల 18న విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగే మహా ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

బాలల హక్కుల వారోత్సవాలు

అమర్తలూరు(వేమూరు): ఆడ పిల్లలను రక్షిద్దాం, ఆడపిల్లలను చదివిద్దాం అంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు సూపర్ వైజర్ అమృతవాణి నేతృత్వంలో నినదించారు. అమర్తలూరు మండలం ముల్పూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల హక్కుల వారోత్సవాలు శనివారం నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అమృతవాణి మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలన్నారు. బాల్య వివాహాలు నేరమని తెలిపారు. అనంతరం బాలికల హక్కుల గురించి వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

బాపట్లటౌన్: పట్టణంలోని రోటరీ కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఉచిత కంటివైద్యశిబిరం నిర్వహించడం జరుగుతుందని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ముప్పలనేని శేషగిరిరావు వర్ధంతి సందర్భంగా శంకర నేత్రాలయం, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో ఉచిత కంటివైద్యశిబిరం నిర్వహిస్తున్నామన్నారు. వైద్యపరీక్షల అనంతరం శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని బాపట్ల నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నిరంతర కృషితోనే గ్రామాల అభివృద్ధి

ఎంపీడీఓ శోభారాణి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎం.శోభారాణి

రేపల్లె రూరల్: గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎంపీడీఓ ఎం.శోభారాణి సూచించారు. గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు 2025–26 ఆర్థిక సంవత్సరానికై స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం మండలంలోని వివిధ గ్రామాల పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు నిర్వహించిన శిక్షణ తరగతులకు ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రజాప్రతినిధులు గ్రామంలో నిర్వహించాల్సిన అభివృద్ధి పనుల నిమిత్తం సమావేశాలు నిర్వహించాలన్నారు. అభివృద్ధి కోసం తీసుకునే నిర్ణయాలు పలువురిని ప్రభావితం చేసేవిధంగా ఉండాలన్నారు. గ్రామంలో రహదారులు, డ్రైనేజీల నిర్వహణ, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, మరమ్మతులు, జనన, మరణ రిజిస్టర్‌ల నిర్వహణ, తాగునీరు తదితర అంశాలను నిరంతరం పర్యవేక్షించటంతో పాటు మాతా, శిశు సంరక్షణా కేంద్రాలు, శ్మశాన వాటికల నిర్వహణలపై దృష్టి సారించాలన్నారు. ప్రజాప్రతినిధులు తమ పంచాయతీ పరిధిలోని గ్రామాలలో నిరంతరం పర్యటిస్తూ ఆయా గ్రామాలలో నెలకొన్న సమస్యలను పంచాయతీలలో జరిగే సమావేశాలలో ప్రస్తావించాలన్నారు. సమస్యల పరిష్కారానికై అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ సమైక్య అధ్యక్షురాళ్లకు గ్రామ అభివృద్ధి ప్రణాళికలపై రీసోర్స్ పర్సన్‌లచే శిక్షణ నిచ్చారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామసమైక్య అధ్యక్షులు పాల్గొన్నారు.

గ్యాస్ నగదు జమ కాకపోవడంపై మహిళల ఆగ్రహం



గ్యాస్ కంపెనీ వద్ద ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మహిళలు, చల్లా రామయ్య

బాపట్లటౌన్: మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ల విషయంలో కూటమి ప్రభుత్వం పేదలను ఇబ్బందులకు గురిచేస్తుందని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య తెలిపారు. గ్యాస్ సిలెండర్ డెలివరీ చేసి వారం రోజులు గడిచినా అకౌంట్‌లో నగదు జమకావడం లేదంటూ శనివారం బాపట్లలో మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు చేసిన ఆందోళనలో చల్లా రామయ్య పాల్గొని గ్యాస్ కంపెనీ నిర్వాహకులను ప్రశ్నించారు. చల్లా రామయ్య మాట్లాడుతూ మహిళలు గ్యాస్ బుక్‌చేసిన 48 గంటల్లోనే వారి అకౌంట్‌లో నగదు జమచేస్తామని చెప్పారని, వారాలు గడుస్తున్నా అకౌంట్‌లో ఒక్కరూపాయి కూడా పడిన దాఖలాలు లేవన్నారు. పేద మహిళలకు ఇచ్చే గ్యాస్ సొమ్ముకు కూడా సవాలక్షా నిబంధనలు పెట్టి మహిళల అకౌంట్లో డబ్బులు వేయకుండా వారిని ఇబ్బందులు గురి చేస్తున్నారన్నారు. గ్యాస్ సొమ్ము త్వరితగతిన జమకానీ పక్షంలో మహిళల పక్షాన త్వరలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆకురాతి విష్ణుమూర్తి, కత్తుల వెంకటేశ్వర్లు, భోగి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మల్లెల మౌనిక పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి పడిపూజ

బాపట్లటౌన్: మండలంలోని ముత్తాయపాలెం గ్రామంలో శనివారం అయ్యప్పదీక్షాపరులు రామాలయంలో ఏర్పాటుచేసిన అయ్యప్పస్వామి పీఠం వద్ద ప్రత్యేకపూజలు నిర్వహించారు. దీక్షాపరులు స్వామివారికి అత్యంత ప్రీతికరమైన అటుకులు, బెల్లం, తేనే, గంధం , ఆవునెయ్యి, పాలు, చెక్కెర, కొబ్బరినీళ్లతో ప్రత్యేకంగా అభిషేకం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సాగిన పడిపూజ మహోత్సవంలో దీక్షాపరులు అయ్యప్పస్వామి గీతాలతో భజనలు మార్మోగించారు. గురుస్వాములు కర్రి వీర్లంకయ్య, అంగిరేకుల కోటేశ్వరరావు, పమిడిబోయిన సూరిబాబు పాల్గొన్నారు.



స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తున్న దీక్షాపరులు



ముత్తాయపాలెంలోని అయ్యప్పస్వామి పీఠం వద్ద ఏర్పాటు చేసిన పడి